# నమస్తే తెలంగాణ

## జోగుళాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 15 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె

# పథకాలు ఆపడమేనా మార్పంటే..?

- అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- 700 ఎకరాలు ఆక్రమించుకున్నట్లు నిరూపిస్తావా..?
- వంశీచంద్‌రెడ్డికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సవాల్
- ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశాం : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, మార్చి 14 : దళితబంధు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఆపడంతోపాటు పంటలు ఎండుతున్నా, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడమేనా మార్పు అంటే అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం మండలకేంద్రంలో దివంగత ఆశిరెడ్డి గురువు పాదుక పూజలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 700 ఎకరాలను ఆక్రమించుకున్నానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి ఆరోపిస్తున్నారని.. అది నిజమని నిరూపిస్తే రాజకీయాల నుంచి తాను తప్పుకుంటానని సవాల్ విసిరారు. నిరూపితం కాకుంటే మీరేం చేస్తారో ప్రకటించాలన్నారు. ఇప్పుడు మీ ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా.. నిరూపించడానికి ఎందుకు భయపడుతున్నారు.? ఎవరు అడ్డువస్తున్నారో చెప్పాలన్నారు. కొన్ని శక్తులు శ్రీనివాస్‌గౌడ్ వస్తే ప్రజల భూములు ఆక్రమించుకుంటారని దుష్ప్రచారం చేసి నన్ను ఓడించారన్నారు. కేవలం అబద్ధాలు, అమలు కాని హామీలు చెప్పి అధికారంలోకి వచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో మేం పదేండ్లు ఎంతో అభివృద్ధి చేశాం. మీరు మా కన్నా ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాలన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తాం.. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. దళితుల భూములను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకోవద్దని, ఒక వేళ తీసుకుంటే దళితులకు అండగా నిలిచి వారి తరఫున పోరాటం చేస్తామని, అవసరమైతే నిరాహార దీక్షలు చేపడతామని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎంపీ మన్నె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసిందన్నారు. ప్రజలకు మంచి చేసే వారిని ఎప్పుడూ ఆదరించాలని సూచించారు. ఒకప్పుడు పాలమూరులో రోడ్లు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా ఉన్నాయో చూస్తున్నారు కదా అన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండిన పంటలకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు రమణారెడ్డి, జంబులయ్య, నాగన్న, నరేందర్, బాలయ్య, యాదయ్య, మన్నాన్, మోహన్, అనంతరెడ్డి, మాధవులు, ఆంజనేయులు, నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క పూటే..



- నేటి నుంచి ఒంటి పూట బడుల అమలుకు విద్యాశాఖ ఆదేశాలు..

నాగర్‌కర్నూల్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ఒంటి పూట బడులకు వేళైంది. ఎండలు ముదురుతుండడంతో విద్యాశాఖ పాఠశాల విద్యార్థులకు ఒంటి పూట బడులు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో శుక్రవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగిసే వరకూ ఈ ఒంటి పూటబడులు అమలు కానున్నాయి. ఈ వేసవిలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు సెగలు కక్కుతున్నాడు. పది దాటితే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దలు సైతం ఎండలకు తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒంటి పూట బడులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాలతో ఇకపై శుక్రవారం నుంచి వార్షిక పరీక్షలతోపాటు ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు ఒంటిపూట బడులు అమలు కానున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఈనెల 18నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఒంటి పూట తరగతులు నిర్వహించనున్నారు. కాగా, ఇప్పటికే విద్యార్థులకు సిలబస్ పూర్తి కావస్తోంది. పరీక్షలకు పునఃశ్చరణ చేసేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత విద్యార్థులు ఇండ్లకు వెళ్లనున్నారు. మధ్యాహ్న భోజనం అమలు జరిగేలా విద్యాశాఖ ఆదేశించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ కొనసాగించాలని స్పష్టంగా సూచించింది. విద్యార్థులు ఉదయం అల్పాహారం చేసి స్కూళ్లకు రావాలని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని విద్యాశాఖ తెలియజేస్తున్నది. కాగా ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఒంటి పూట బడులు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎవరూ మధ్యాహ్నం పాఠశాలలు నిర్వహించరాదని, ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవోలు ఇప్పటికే హెచ్చరించారు. విద్యార్థులు ఒంటిపూట బడులను ఆహ్లాదానికి కాకుండా పరీక్షల సన్నద్ధతకు ఉపయోగించుకోవాల్సిందిగా ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. గత ఏడాదిపాటు జరిగిన సిలబస్‌ను పూర్తిస్థాయిలో అభ్యసించాలని, పునఃశ్చరణ చేసుకోవాలని, సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇదిలా ఉంటే పదో తరగతి పరీక్షలకు నాలుగు రోజులే ఉండటంతో ఆ విద్యార్థులకు ప్రత్యేకంగా సందేహాలు నివృత్తి చేయనున్నారు. మొత్తమ్మీద ఒంటి పూట బడులు రావడంతో విద్యార్థుల్లో సంతోషం వ్యక్తమమవుతోండగా తల్లిదండ్రులు మాత్రం విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాల్సి ఉన్నది.

***వనపర్తి జిల్లాలో..***

వనపర్తి టౌన్, మార్చి 14 : వనపర్తి జిల్లాలో 352 ప్రాథమిక, 57 ప్రాథమికోన్నత, 99 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గురుకులాలు, అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 735 పాఠశాలల్లో 91,101 మంది విద్యార్థులు చదువుతున్నారు.

***టైం టేబుల్ ఇలా..***

ఉదయం 7:45 గంటలకు బెల్లు ప్రారంభంకాగా 7:50 నుంచి 8 గంటల వరకు ప్రార్థన పూర్తయ్యి 10 గంటల వరకు మొదటి సెషన్ కొనసాగుతుంది. 20 నిమిషాలు విరామం తర్వాత 10:20 నుంచి 12:30 గంటల వరకు పాఠశాల తరగతులు కొనసాగనున్నాయి. ఇందుకు విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి.

# చేనుకు నీరు లేదు.. పంట చేతికొచ్చేలా లేదు!

మక్తల్ టౌన్, మార్చి 14 : ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలు చేతికందే సమయంలో సాగునీరు లేకపోయింది. దీంతో చేసేది లేక రైతులు పంటలను బీళ్లు పెట్టడం.. పశువులకు వదిలేయడం చేస్తున్నారు. మక్తల్‌కు చెందిన రైతు లక్ష్మీకాంత్‌రెడ్డి యాసంగిలో వరి సాగుచేశాడు. రెండు నెలలపాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. పంట చేతికొచ్చే సమయంలో నీరు లేకపోవడంతో చేసేదేమీ లేక పంటను పశువుల మేతకు వదిలేశాడు. ఇలా మండలంలో ఎక్కడ చూసినా రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉన్నది. వానకాలం సరైన వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల్లో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు సైతం అడుగంటిపోయాయి. దీంతో యాసంగిలో బోరు బావుల కింద పంటలు సాగు చేసినా అవి చేతికొచ్చే సమయంలో బోర్లు ఎండిపోవడంతో రైతులు పంటలు కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతులు అప్పులు చేసి బోర్లు వేసినా చుక్కనీరు పడడం లేదు. దీంతో పంటలకు పెట్టిన పెట్టుబడి, బోరు బావుల కోసం చేసిన అప్పులు తడిసి మోపడవుతుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఎండుతున్న పంటలను చూసైనా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



వరి పొలానికి నీరు లేకపోవడంతో చేతికొచ్చిన పంటను పశువులకు మేతగా వదిలేసిన రైతు

## రోడ్ల అభివృద్ధికి రూ.850 కోట్లు

- మంజూరు చేసిన కేంద్ర సర్కారు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 31 రాష్ట్ర రహదారుల విస్తరణ, ఆధునికీకరణ పనుల కోసం కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ రూ.850 కోట్లు మంజూరు చేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఎఫ్‌ఐ) కింద నిధులు కేటాయించింది. వీటితో 31 రహదారులను 435.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. దీంతో పర్యాటకం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో బాలానగర్–గంగాపూర్, వనపర్తి–పెబ్బేరు, నాగర్‌కర్నూల్–గోపాల్‌పేట వయా రేవల్లి రోడ్లను డబుల్‌లేన్‌గా ప్రతిపాదించారు. అలాగే కొల్లాపూర్‌లో తీగలపల్లి–యాపట్ల రోడ్డు, కల్వకుర్తి–రఘుపతిపేట, కల్వకుర్తి–ఉల్పర రోడ్డు వయా రంగాపూర్, వనపర్తిలో బలిజపల్లి బ్రాంచ్ రోడ్డు, పెబ్బేర్–యాపర్ల రోడ్డు, నాగర్‌కర్నూల్–గోపాల్‌పేట, పెద్దమందడి–ఎన్‌హెచ్ 44 రోడ్డుపై వంతెనలను నిర్మించేందుకు ప్రతిపాదించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా, బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- అలంపూర్, వనపర్తిలో ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం
- హాజరైన ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

# బీఆర్‌ఎస్ గెలుపే ధ్యేయం

ఉండవెల్లి, మార్చి 14 : స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని గెలిపించి పార్టీ రుణం తీర్చుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. నవీన్‌కుమార్‌రెడ్డిని పరిచయం చేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ నవీన్‌కుమార్‌రెడ్డి గతంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేశారన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలు తెలిసిన వ్యక్తిని శాసనమండలికి పంపితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 1,439 మంది ఓటర్లు ఉండగా.. అందులో 880 మంది బీఆర్‌ఎస్ పార్టీ వారే ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నిక ఏకపక్షం ఉండడంతో ప్రజాస్వామ్యయుతంగా గెలుపొందలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేస్తున్నారని, విచ్చలవిడిగా డబ్బుల పంపిణీకి సిద్ధం అవుతున్నారన్నారు. వారి కుయుక్తలను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు తిప్పికొట్టాలన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలకు పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు అధికార పార్టీ ప్రలోభాలకు గురికాకుండా నవీన్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పార్టీ ప్రతిష్టను పెంచుదాం

వనపర్తి, మార్చి 14 : ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా నవీన్‌రెడ్డిని గెలిపించుకొని పార్టీ ప్రతిష్టను మరింత పెంచుదామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి మాజీ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు కలిసికట్టుగా నవీన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ విజయం పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండే పార్టీ అభ్యర్థులకు మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పాటు పడుతానన్నారు. స్థానిక సంస్థల హక్కుల కోసం పోరాడుతానని, మీరంతా సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. తనపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఉమ్మడి బీఆర్‌ఎస్ నేతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



జోగుళాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రముఖులు

## 'జోగుళాంబ' నుంచే ప్రచారం..

అలంపూర్, మార్చి 14 : అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయాలను గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారిని శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి ఆశీసులతో ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చిన్ని కృష్ణయ్యనాయుడు, ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రజాప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల

# ప్రలోభాలకు గురై ఆగం కావొద్దు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కలిసికట్టుగా పనిచేద్దాం : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- విజయం మనదే.. : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

గద్వాల, మార్చి 14 : రాజకీయాల్లో నడిగడ్డకు ప్రత్యేక చరిత్ర ఉందని, కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు లొంగితే భవిష్యత్ ఆగమవుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా గురువారం స్థానిక సంస్థల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేద్దామన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును నవీన్‌కుమార్‌రెడ్డికి వేయాలని సూచించారు. ఇప్పటికే గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు మన ప్రజాప్రతినిధులను ఇబ్బందులు, ప్రలోభాలకు గురిచేస్తున్నారని.. వాటికి లొంగకూడదన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని.. ఆ పార్టీకి ఉప ఎన్నికలో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేస్తే ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు పెద్దకష్టమేమీ కాదన్నారు. మరోసారి మన నడిగడ్డ పౌరుషం చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఆ పార్టీ బరిలో నిలిపిన అభ్యర్థికి ఓటు వేస్తే మనకు ఘోస తప్పదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు అవకాశమిచ్చారని, ఎమ్మెల్సీ గెలుపును ఆయనకు కానుకగా ఇద్దామన్నారు. తనకు అండగా ఉంటే.. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.




***వరి పొలం ఎండుతున్నది..***



గతంలో ఎన్నడూ లేనంతగా బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయి. ఎకరం వరి పంట నాటితే కలుపుతీశాక నీళ్లు సరిపోకపోవడంతో ఎండిపోతున్నది. రూ.30 వేలు పెట్టుబడి పెట్టి వరి నాటితే బోర్లలో నీళ్లలేక ఎండిపోతుంది. ఏమిచేయలేని పరిస్థితిలో ఎండిపోతున్న వరిపైరులో రోజూ ఎద్దులను మేపుతున్నా.. మూడుబోర్లను ఒక్క చోట కలిపినా ఆ నీటితో గుంట కూడా పారడం లేదు. ఇటువంటి కాలం ఎన్నడూ చూడలేదు. *- లింగం, రైతు, కోడ్గల్, జడ్చర్ల మండలం*

***బోర్లల్లో నీళ్లు వస్తలేవు..***



ప్రతి సంవత్సరంలా యాసంగిలో కూడా మంచిగా నీళ్లు ఉంటాయిలే అని ఎకరం పొలంలో గోధుమ సాగు చేశా. కానీ బోర్లలో నీళ్లు రావడం లేదు. దీంతో గోధుమ పంట చేతికందే సమయంలో ఎండిపోయింది. కాలాన్ని నమ్ముకుంటే నట్టేట ముంచింది. పంటసాగు చేయక పోయినా పెట్టుబడి మిగిలేది. కానీ పంటెండింది.. పైసలుపోయినవి. ప్రభుత్వమైనా ఆదుకుంటే బాగుంటుంది.

*- ఆంజనేయులు, రైతు, బూరెడ్డిపల్లి, జడ్చర్ల*



భూగర్భ జలాలు అడుగంటడంతో సన్నగా పోస్తున్న బోరు





జడ్చర్ల మండలంలోని కోడ్గల్ గ్రామంలో నీళ్లు లేక ఎండిన వరిపైరును తింటున్న కాడెద్దులు, నీళ్లు లేక ఎండిపోయిన గోధుమపంట

# ఎండుతున్న పంట జీవాలకు మేత


- అందని నీటితడి.. వాడుపట్టిన పైరు
- వేగంగా అడుగంటుతున్న నిల్వలు
- బోర్లు వేసినా చుక్క నీరు పడని దుస్థితి
- పంటలను కాపాడేందుకు నానాపాట్లు
- యాసంగికి తప్పని సాగునీటి ఇక్కట్లు
- ఆవిరవుతున్న కర్షకుల ఆశలు

జడ్చర్ల, మార్చి 14 : ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులు ఏటా ఏదో ఒకరూపంలో పంటలను నష్టపోతూనే ఉన్నారు. ఉంటే అతివృష్టి, లేదా అనావృష్టి ఈ రెండింటికీ మధ్య రైతులు నలిగిపోతున్నారు. వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగించే రైతులకు పంట మంచిగా పండితే ఆనందం.. లేదంటే అప్పులు తప్పా మిగిలేదేమీ ఉండదు. వ్యవసాయం అంటేనే నీటి ఆధారంగా పంటలు సాగు చేయడం దానికి వర్షాలే ఆధారం. ఆ వర్షాలు ముఖం చాటేస్తే ఇక అందరిపని గోవిందా.. ఈ ఏడాది వానకాలంలో వర్షాలు ప్రతి యేడాదిలా అనుకూలంగా కురవకపోవడం వలన భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. దీంతో బోర్లలో నీళ్లు రాక ఈ యాసంగిలో బోర్లుకింద సాగుచేసిన వరి, మొక్కజొన్న, గోధుమ తదితర పంటలు ఎండుతున్నాయి. చాలా వరకు రైతులు యాసంగిలో వరినాట్లు వేసి కొంతమంది కలుపు తీస్తుండగా కొన్ని ప్రాంతాల్లో పొట్టదశలో ఉన్నాయి. నీళ్లు అవసరమైన సమయంలోనే సరిపడ నీళ్లలేక వరిపైర్లు ఎండుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు పెట్టుబడి పెట్టి పంటలను సాగుచేస్తే అవి మధ్యలోనే ఎండిపోతున్నాయి. కండ్లముందే పంటలు ఎండిపోతున్నా కాపాడుకోలేని దుస్థితిలో రైతులు ఉన్నారు. పంటలను కాపాడుకోవడానికి కొత్తగా బోర్లు వేసినా వాటిలో నీళ్లు రావడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లుకూడా ఎప్పటికంటే 100 ఫీట్లు అధికంగా లోతుకు వేయడం జరుగుతున్నది. అయినా నీళ్లు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్లు వర్షాలు బాగా కురవడంతో ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలు సాగు చేసుకున్న రైతులకు ఈ యేడాది సరైన వర్షాలు లేకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పొట్టదశలో ఉన్న పంటలను కాపాడుకోలేక రైతులు పశువులను మేతకు వదిలేస్తున్నారు. జడ్చర్ల మండలంలో యాసంగిలో దాదాపు 6వేలకుపైగా ఎకరాలలో వరిపంట సాగు చేశారు. గత ఏడాదికంటే 2వేల ఎకరాలు తక్కువగా వరి నాటడం జరిగింది. అందుకు కారణం జనవరిలోనే బోర్లలో నీళ్లు తగ్గడంతో రైతులు సాగును తగ్గించారు. కానీ భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతుండడంతో బోర్లు నీళ్లు పోయడం లేదు. కొంతమంది రైతులకు చెందిన వరి పంటలు పూర్తిగా ఎండిపోతుంటే.. మరికొంతమంది రైతులది ఆరుతడిలా నీటిని ఇస్తున్నారు. ఇక నెలరోజులైతే వారి పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఎండిన పంటలనైనా గుర్తించి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

# రైతన్నకు కష్టకాలం

- వరి పొట్ట దశలో బీటలు వారుతున్న పొలాలు

దేవరకద్ర, మార్చి 14 : గతేడాది మాదిరి ఈ ఏడాది యాసంగిలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చన్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంట పొలాలకు సాగునీరు లేక బీటలు బారుతున్నాయి. దీంతో చేసేది లేక రైతులు తమ పంటలను పశువుల మేత కోసం వదిలేస్తున్నారు. మండలంలోని కోయిల్‌సాగర్, చిన్నరాజమూర్, అజిలాపూర్, పెద్దరాజమూర్, నాగారం, గోపన్‌పల్లి తదితర గ్రామాల్లో రైతుల బోరు బావుల కింద దాదాపు 4,150 ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ బోర్లలో నీరు మొత్తం అడుగంటిపోవడంతో బోరుబావుల కింద సాగు చేసిన భూ ములన్నీ ఎండిపోతున్నాయి. అజిలాపూర్‌కు చెందిన రైతు కృష్ణారెడ్డి ఐదు ఎకరాల భూమిలో రెండు బోర్ల కింద వరి పంటను సాగు చేయగా కొన్ని రోజుల నుంచి బోర్లలో నీరు రాకపోవడంతో పొట్టదశలో ఉన్న పంట మొత్తం ఎండిపోయి పొలం అంతా బీటలు బారడంతో సదరు రైతు తన పంటను గొర్రెలు, పశువులకు మేతకు వదిలేశాడు. ఇలా చాలా గ్రామాల్లో చేతికందివస్తున్న పంటలను కాపాడుకోలేక పశువులకు మేతకు వదిలేస్తున్నారు. అయితే పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



అజిలాపూర్ సమీపంలో ఎండిన వరి పంటను మేస్తున్న గొర్రెలు